క్లుప్తంగా

తిరుచ్చిపై సూర్యనారాయణుడి వైభవం



తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న సూర్యనారాయణుడు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామి వారు గురువారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం స్వామివారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నివాళి



సుబ్బమ్మ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: నగరంలోని సత్యనారాయణపురంలో నివాసం ఉంటున్న జర్నలిస్టు కృష్ణయాదవ్ మాతృమూర్తి కాటా సుబ్బమ్మ గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలిసి వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి కృష్ణయాదవ్ ఇంటికి వెళ్లి సుబ్బమ్మ మృతదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మల్లారపు మధుకు దళితరత్న అవార్డు



అవార్డు అందుకున్న మల్లారపు మధు

తిరుపతి కల్చరల్: దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీనియర్ దళితనేత మల్లారపు మధుకు దళితరత్న అవార్డు లభించింది. ఈ మేరకు ఎస్సీ, 57 ఎంబీ ఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన అవార్డుల ప్రదానం కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.వెంకటేశం ఆయనకు దళితరత్న అవార్డుతో ఘనంగా సత్కరించి అభినందించారు. దళితులకు చేసిన కృషిని గుర్తించి తనకు అవార్డు ఇవ్వడం సంతోషకరమని, ఇదే స్ఫూర్తితో దళిత ప్రజల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తారని మల్లారపు మధు తెలిపారు.

మెటీరియల్ తనిఖీ



విద్యార్థులకు అందించనున్న షూలను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి: స్థానిక శ్రీపద్మావతి బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను గురువారం డిప్యూటీ డైరెక్టర్ అనురాధ, సీఎంఓ సురేష్ తనిఖీలు చేశారు. ఎంఈఓ భాస్కర్ బాబు ప్రతి స్టాకుకు సంబంధించిన (యూనిఫాం, బ్యాగ్స్, బెల్ట్, షూస్, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు) వివరాల రికార్డులను అందజేశారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు దాదాపు సరఫరా చేయడం జరిగిందన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

పాకాల : మండలంలోని అన్ని స్కూళ్లకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్‌ను గురువారం ఎంఈఓలు బాబ్జి, లింగయ్య చేతుల మీదుగా ఈ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: విద్యార్థి దశ నుంచే పిల్లలు పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తిరుపతి రూరల్ ఎంఈఓ శంకరయ్య అన్నారు. గురువారం స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని గ్రేడ్ వన్ ప్రభుత్వ గ్రంథాలయం అధికారి జె.శివప్రసాద్ అధ్యక్షతన వేసవి విజ్ఞాన తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ హరిప్రసాద్ విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కిశోర్ కుమార్, ఇంపాక్ట్ రీజనల్ ప్రెసిడెంట్ తహసున్నీసా బేగం, డాక్టర్ పి.గోపాల్, ఇంగ్లిషు ట్రైనర్, గాయత్రి దేవి, అర్చన, డాక్టర్ సోము ఉమాపతి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,288 మంది స్వామిని దర్శించుకున్నారు. 32,079 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వకపోగా.. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలపై వివక్ష చూపుతోంది. ఇప్పటికే నివాసం ఉంటున్న వారి కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఆలోచనే చేయట్లేదు. ఇంకా నిర్మాణదశలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు డబ్బులు అందించలేదు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై పూర్తిగా ‘పచ్చ’నేతలు పక్షపాతం చూపుతున్నారు. పల్లె పండుగ పేరిట రాష్ట్రవ్యాప్తంగా హడావుడి చేసిన ప్రభుత్వం జగనన్న కాలనీల్లో రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో మాత్రం తీవ్ర వివక్ష చూపుతోంది.

చంద్రగిరి: కొత్తశానంబట్ల సమీపంలోని జగనన్న కాలనీలో ఆగిన ఇంటి నిర్మాణాలు , సిమెంటు రోడ్డు వేయకపోవడంతో రోడ్డుపై పారుతున్న మురుగు





నిరుపేదలపై పచ్చపాతం

- జగనన్న కాలనీల లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం కక్ష
- నివాసం ఉంటున్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం
- నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు నిధులు ఇవ్వకుండా వేధిస్తున్న పాలకులు
- గత ప్రభుత్వం పేదలకు ఇళ్లను మంజూరు చేయడమే నేరమా ?
- కనీస సదుపాయాలు కల్పించాలని వేడుకుంటున్న పేదలు

తిరుపతిరూరల్ : గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేస్తూ వచ్చారు. వేలాది ఎకరాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా ఇళ్ల పట్టాలను మంజూరు చేశారు. అనంతరం ఇంటి నిర్మాణాల బాధ్యతను కూడా ప్రభుత్వమే భుజస్కంధాలపై వేసుకుని పూర్తి చేస్తూ వచ్చింది. అయితే ప్రభుత్వం మారడంతో నిరుపేదల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక నివాసాలు ఉంటున్న పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా వివక్ష చూపుతోంది. నిర్మాణదశలో ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు చేయూత అందించి ఇళ్లు పూర్తయ్యేలా చూడాల్సింది పోయి డబ్బులు ఇవ్వకుండా నిరుపేదలకు నరకం చూపిస్తోంది. దీంతో కనీస సదుపాయాలు లేక జగనన్న కాలనీల్లో ఉంటున్న వారు అత్యవసర వేళల్లో ఆస్పత్రులకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.

అధికారం చేపట్టినప్పటి నుంచి వివక్షే..

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, రామచంద్రాపురం, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లోని నిరుపేదలకు గత ప్రభుత్వంలో పెద్దఎత్తున ఇళ్ల స్థలాలు కేటాయించారు. గత ప్రభుత్వంలో ఒక్క చంద్రగిరి నియోజకవర్గానికే 532 ఎకరాల్లో 11,325 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఎంతోకాలంగా సొంతిళ్లు లేని 10,045 మంది పేదలకు ఇళ్లు కూడా మంజూరు చేశారు. సుమారు రూ.109 కోట్లు ఇంటి నిర్మాణాలకు దశల వారీగా విడుదల చేశారు. పేదలందరికీ గూడు ఏర్పాటు చేయాలన్న సదుద్దేశంతో గత ప్రభుత్వం మంచి చేసినప్పటికీ కూటమి ప్రభుత్వం ఆ కాలనీలపై నిర్లక్ష్యం వహిస్తోంది.

అవసరాలకు పెట్టిన భూమి కబ్జా..

చంద్రగిరి మండలం కొత్తశానంబట్ల, పిచ్చినాయుడుపల్లి పరిసరాల్లో సుమారు 5 వేలకు పైగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలు కేటాయించారు. అతిపెద్ద లేఅవుట్ వేసి సుమారు 40 అడుగుల వెడల్పుతో రోడ్లకు స్థలం వదిలిపెట్టి ప్లాట్లు వేయడంతో చూడడానికి ఎంతో అందంగా కనిపిస్తోంది. అయితే 5 వేల ఇళ్లకు అక్కడ పట్టాలు మంజూరు చేయడంతో ఆ ఇళ్లలో నివాసం ఉన్నవారికి భవిష్యత్‌లో పాఠశాల, ఆస్పత్రి, గ్రంథాలయం, కమ్యూనిటీ భవనం , ఉద్యానవనం వంటి భవనాలను నిర్మించడానికి కేటాయించిన స్థలాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పచ్చనేతలు దర్జాగా కబ్జా చేసేశారు. అంతేకాకుండా తిరుపతి నగర పాలక సంస్థ తరఫున సుమారు 10వేల మందికిపైగా ఇళ్ల స్థలాలను చంద్రగిరి మండలం ముగిలిపుట్టు, ఎం.కొత్తపల్లి, ఏజీపల్లి ప్రాంతాల్లో కేటాయించారు. అక్కడ కూడా నిధులు విడుదల చేయకపోవడంతో పాటు నిర్లక్ష్యం చూపుతుండడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. రాజకీయ కక్షతో కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమని ఆ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏఏ మండలాల్లో ఎన్ని ఇళ్లు ఇచ్చారంటే..!
చంద్రగిరి నియోజకవర్గం

మండలం	లబ్ధిదారులు	జగనన్న లేఅవుట్లు
చంద్రగిరి	2245	10
తిరుపతి రూరల్	3225	4
చిన్నగొట్టిగల్లు	1236	6
ఎర్రావారిపాళెం	956	4
పాకాల	2586	7
రామచంద్రాపురం	1077	6

రోడ్లు వేస్తే బాగుంటుంది



జగనన్న కాలనీలో ఇళ్లు కట్టుకునేందుకు గత ప్రభుత్వంలో అన్ని రకాల వసతులు కల్పించారు. ఈ ప్రభుత్వం వచ్చాక రోడ్లు వేస్తారని ఎంతో ఆశపడ్డాం. రోడ్లు ఇప్పుడే వేసేటట్టు లేరు. రాత్రి వేళల్లో నడవడానికి ఇబ్బందిగా ఉంది. వర్షం వస్తే బురదమయం అవుతోంది. రోడ్లు వేస్తు బాగుంటుంది.

- సుభాషిణి, జగనన్న కాలనీ వాసి, చంద్రగిరి

మురుగు కాలువలు లేవు



జగనన్న కాలనీలో మురుగునీరు పారడానికి కాలువలు లేవు. ఇళ్ల వద్ద సెప్టిక్ ట్యాంకులు కట్టుకున్నా వర్షపు నీరు వచ్చిందంటే నెల రోజులైనా ఇంకడం లేదు. నడవడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. దయచేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవిస్తున్నాం.

- స్నేహ, జగనన్న కాలనీ వాసి, చంద్రగిరి

జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ రన్నరప్‌గా చిత్తూరు జట్టు



రన్నర్స్ ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల గుంటూరు వేదికగా జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో అమరావతి కప్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో చిత్తూరు, వైఎస్సార్ కడప జట్లు ఫైనల్ చేరాయి. బుధవారం మధ్యాహ్నం గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఈ రెండు జట్ల మధ్య ఫైనల్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 169 పరుగులు చేసింది. తరువాత 170 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 16 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 135 పరుగులు మాత్రమే చేసి 34 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన చిత్తూరు జిల్లా జట్టు కెప్టెన్ శ్రీనివాసులు బెస్ట్ బౌలర్‌గా, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కడప ఆటగాడు పఠాన్ అవార్డులు అందుకున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ చేతుల మీదుగా రన్నర్ ట్రోఫీని జిల్లా జట్టు అందుకుంది.

సర్వభూపాలుడిపై గోవిందుడి వైభవం



సర్వభూపాల వాహనంపై దర్శనమిస్తున్న శ్రీగోవిందరాజస్వామి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు గురువారం రాత్రి శ్రీగోవిందరాజస్వామి సర్వాంగ సుందర రూపుడై సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులకు కటాక్షించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి కల్పవృక్ష వాహనసేవ, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి సర్వభూపాల వాహన సేవ భజన బృందాల కోలాటాలు, భజనల మధ్య అత్యంత కోలాహలంగా సాగింది. శుక్రవారం రాత్రి 7 నుంచి 10 గంటల వరకు స్వామివారి గరుడ సేవ జరుగనుంది. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, డెప్యూటీ ఈఓ వీఆర్ శాంతి, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి, ఎఫ్‌ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఏవీఎస్‌ఓ మోహన్‌రెడ్డి, పలువురు అధికారులు, శ్రీవారి సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి



లేఅవుట్‌లను పరిశీలిస్తున్న తుడా ఉపాధ్యక్షురాలు

తిరుపతి తుడా: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధ్యక్షుడు మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళం సమీపంలో ఏర్పాటు చేసిన శేషాచల హిల్ వ్యూ లేఅవుట్‌ను గురువారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ లేఅవుట్‌లో అన్ని సదుపాయాలు కల్పించాలని, అలాగే అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలు జరగకుండా చూడాలన్నారు. ఎస్‌హెచ్‌వీ లేఅవుట్‌లో పార్కులను పరిశీలించి ఆక్రమణలకు గురి కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతి



జూట్, వస్త్ర బ్యాగులను ఉపయోగించాలని అవగాహన కల్పిస్తున్న కమిషనర్, అధికారులు

తిరుపతి తుడా: ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతిఒక్కరూ కలసి రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైతు బజారులో ప్రజలకు వస్త్ర బ్యాగులను కమిషనర్ పంపిణీ చేసి, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వినియోగం వల్ల మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని అన్నారు. ఇప్పటికే తిరుపతిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్, 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ నిషేధించామన్నారు. కూరగాయలు కొనేందుకు వచ్చేవారు వస్త్ర, జూట్ బ్యాగులు వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, కార్పొరేటర్లు, మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో రెచ్చిపోయిన ఇసుక మాఫియా



అక్రమంగా ఇసుకను తరలిస్తూ అడ్డుకున్న గ్రామస్తులపై దౌర్జన్యం చేస్తున్న ఓ వ్యక్తి

తిరుపతి రూరల్ : ప్రకృతిని నాశనం చేస్తున్న వారు నాశనమైపోతారని వేమూరు గ్రామానికి చెందిన మహిళలు దుమ్మెత్తిపోశారు. తిరుపతి రూరల్ మండలం వేమూరులో ఇసుక మాఫియా బరి తెగించింది. ఇసుక తోడుకునేందుకు వచ్చిన వారిని గ్రామస్తులు అడ్డుకోవడంతో ఇసుకాసురులు దాడులకు తెగబడ్డారు. స్థానిక టీడీపీ నేతలు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తూ ప్రకృతి వనరులను దోచేస్తూ పంట పొలాలను నాశనం చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం స్థానిక వడ్డిపల్లి వద్ద అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారు. వారిని నిలదీస్తే స్థానిక ప్రజాప్రతినిధి అనుమతితోనే ఇసుక తరలిస్తున్నట్టు చెబుతున్నారని, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరూ తమను ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. మీకు దిక్కున్న చోటు చెప్పుకోవాలని దౌర్జన్యం చేస్తున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఇంత దారుణం ఏనాడూ జరగలేదని, శ్మశానాలను కూడా వదలకుండా తవ్వేస్తున్నారని ఆరోపించారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం



పిల్లలకు మొక్కలు పంపిణీ చేస్తున్న మురళి

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీకుమార్ ఆస్పత్రి ఆవరణలో వైద్యాధికారులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్విమ్స్, వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు

ఎస్వీ వెటర్నరీ కళాశాలలో..

ఎస్వీ వెటర్నరీ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

ఆరోగ్యకర పర్యావరణానికి కృషి చేద్దాం

తిరుపతి కల్చరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన పర్యావరణానికి దోహద పడాలని ఏపీపీసీబీ కర్నూలు జోనల్ జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎస్ఎస్ఎస్ మురళి పిలుపునిచ్చారు. గురువారం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ప్రాంతీయ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చెట్ల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో అందరికీ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.శ్రీనివాస నెహ్రూ, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.



స్విమ్స్ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీకుమార్

పర్యావరణ రక్షణతోనే మానవ మనుగడ

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతమ్మ రోడ్డులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, కమిషనర్ మౌర్యతో కలసి గురువారం మొక్కలు నాటారు. అలాగే ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ట్రైనర్ కేశవ్, రీజనల్ ప్రెసిడెంట్ తహసునీసా బేగం పాల్గొని మొక్కలు నాటారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గటల వరకు మోహినీ అవతారంలో తిరుచ్చి ఉత్సవం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు గరుడ వాహనసేవ
- జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సీఆర్ నారాయణ గ్రంథాలయం ప్రారంభం
- అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు వస్త్రాలంకరణ సేవ, అభిషేకం, సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ.
- తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు సాయంత్రం 6 గంటలకు తిరుచి ఉత్సవం

పుట్టగొడుగుల విత్తన తయారీపై శిక్షణ

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి ఆధ్వర్యంలో కళాశాల దత్తత గ్రామమైన దోర్నకంబాలలో గురువారం పుట్టగొడుగుల విత్తన తయారీపై గురువారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.అరుణశ్రీ, సంధ్య పుట్టగొడుగుల విత్తన తయారీ, పుట్టగొడుగుల ప్రాముఖ్యత, పుట్టగొడుగుల పెంపకం గురించి సుదీర్ఘంగా వివరించారు. ఇందులో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అడిగిన సందేహాలకు సమాధానాలు, సూచనలు ఇచ్చారు.

దొరస్వామిరెడ్డికి నివాళి



నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాకాల పంచాయతీ ఉపసర్పంచ్ ప్రకాష్‌రెడ్డి తండ్రి కోనపురెడ్డి దొరస్వామిరెడ్డి(104) బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం భారతంమిట్టకు చేరుకుని నివాళులు అర్పించారు. అనంతరం ప్రకాష్‌రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నాయకులు మునీర్, కపిలీశ్వర్‌రెడ్డి, రమేష్, చంటి, సెంథిల్, ఖాదర్‌వల్లీ, మురళి, బేటా పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో గాయకుడు శ్రీరామచంద్ర



చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ప్రముఖ సినీ గాయకుడు శ్రీరామచంద్ర గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కోవిడ్‌పై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది

తిరుపతి తుడా: కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొనే క్రమంలో ఎదురయ్యే లోటుపాట్లపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆయా ఆస్పత్రుల వైద్యాధికారుల సమక్షంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కోవిడ్ నిర్ధారణ కోసం పరీక్షలు చేసే విధానం, పాజిటివ్‌గా గుర్తిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు, వారికి అందించాల్సిన సదుపాయాలు, వైద్యసేవలపై వివరించారు. రుయా, స్విమ్స్, పిహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యసిబ్బంది మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు.